# తీరైన తీర్పు

శ్రీ గుజ్జాం వెంకట్రాజు

మావూరి కంతా మా నాన్నగారే పెద్ద. మా వూళ్లో వాళ్ళందరికీ ఆయన ఎంత చెబితే అంత. మంచిగానీ, చెడుగాని నిర్ణయించటంలో మానాన్న గారంతటి వారు మరొకరు పుట్టబోరని కూడా మావూరి పెద్దలు మెచ్చుకుంటారు.

ఆవేళ ఆదివారం కావటంచేత నేను మా యింటి అరుగుమీద లెక్కలు చేసుకుంటూ కూర్చున్నాను. ఇంతలో నలుగురు రైతులు వాళ్లల్లో వాళ్లు ఏవో వాదులాడుకొంటూ మానాన్న గారి దగ్గరకు వచ్చారు. ముందుగా మానాన్నకు నమస్కారంచేసి వాళ్లు నలుగురూ కూడా క్రింది అరుగుమీద కూర్చుని వాళ్లగొడవ చెప్పటం మొదలెట్టారు.

వారు నలుగురూ అన్నదమ్ములు. వాళ్లతండ్రి చనిపోయినప్పుడు ఆ ఆస్తినంతా వాళ్లు నల్గురికీ మా నాన్నగారే, తగువులు, రాకుండా పంచి యిచ్చారన్న సంగతి నాకు తెలుసు. కాని వారికో కుక్క ఉండేదట. ఆకుక్కను నలుగురుకీ సమానంగా పంచటం ఎలా? అంచేత ఆకుక్కను ఎవరో ఒకరు తీసుకోండని మా నాన్న గారు చెప్పారట కానీ, వారికా తీర్పు నచ్చక నలుగురూ ఆకుక్క నాలుగు కాళ్లనూ పంచుకున్నారు. అంటే-తలా ఒకకాలూకోసి పట్టుకు పోయారని కాదు. ఎవరి వాటా కాలుని వాళ్ళు జాగ్రత్తగా పోషించుకోవాలన్నమాట.

సరే. కొన్నాళ్ళవరకూ ఏమీ తగువులు లేకుండానే కాలం గడిచి పోయింది. ఒకనాడు మూడోవాని వాటాకు వచ్చిన కుక్క కాలికి దెబ్బ తగిలిందిట. మిగతా ముగ్గురన్నదమ్ములూ చెప్పిన మీదట అతడా కాలికి నూనెగుడ్డ కట్టాడట. మరునాడు ఎవరుపన్లు వారు చూసుకోడానికి పొలానికి వెళ్ళిపోయారు.

ఆవేళ మధ్యాహ్నం ఎదో ప్రమాదవశాత్తు కుక్క కాలికి కట్టిన నూనె గుడ్డకి నిప్పు అంటుకొందిట. ఆకుక్క భయపడిపోయి పరుగు పరుగున యీ నలుగురు అన్నదమ్ములు వున్న పొలంలోకి వచ్చిందట. అక్కడే నలుగురన్నదమ్ముల తాలూకు వరి కుప్పలు వున్నాయట. కుక్క, తన కాలుకి అంటుకున్న మంటను ఆర్పుకొనే ప్రయత్నంలో ఆ కాలుని ఓ వరి కుప్పకు రాసిందట. ఇంకేముందీ? ఆకుప్ప అంటుకొందిట. అర నిముషంలో ఆ వరుసనే వున్న నాలుగు కుప్పలకీ నిప్పు అంటుకొని, ఆ నలుగు రన్నదమ్ములు అక్కడికి వచ్చేలోగానే, బూడిద అయాయట.

కారణం తెలుసుకొన్న మీదట యిదంతా మూడోవాని మూలానే జరిగిందనీ, వాడా కాలికి నూనెగుడ్డ కట్టినందు వల్లనే అదంటుకొని అందు మూలంగానే కుప్పలు కాలిపోయాయనీ,అందుచేత తమకు నష్టపరిహారం యిమ్మని తక్కిన ముగ్గురన్నదమ్ములు నాల్గోవాణ్ణి పట్టి బలవంతాన మా నాన్న దగ్గరకు లాక్కొచ్చారు. ఈ వార్త ఊళ్లో అందరికీ తెలిసి మా నాన్న ఏం తీర్పు చెపుతారో విందామని మా అరుగుల చుట్టూ గుమి గూడారు. నేను కూడా లెక్కలు చెయ్యటం మానేసి కలం జేబులో పెట్టేసి చూస్తూ కూర్చున్నా. ఎవరికి తోచింది వారు చెప్పుకుంటున్నారు. మా నాన్న వాదనలన్నీ సావకాశంగా విని, 'తీర్పు రేపు చెబుతా' నన్నారు. అందరూ అప్పటికి తమ తమ యిళ్లకి వెళ్ళిపోయారు.

ఇంటి దగ్గర నాన్నకేమీ తోచటంలేదు. తీర్పు ఎలా చెప్పటం? ఉభయ పార్టీలకూ నష్టం లేకుండా



ఐజెటుమ్
నేత్రరోగములకు గొప్పకాటుక.
ట్యూబు రు.2-0-0
ఆప్టిమక్ కో.,సాలూరు



# ★ తీరైన తీర్పు ★

...ంచాలి. మూడో వాడు కాలికి నూనె గుడ్డ కట్టినందువల్లనే నిజానికి యీ ముప్పు వచ్చింది. కనుక నష్ట పరిహారం వాడే యిచ్చుకోవాలి. పాపం-వాడు మాత్రం ఎలా యిచ్చుకోగలడు? వాడికి మాత్రం ఏం తెలుసు యిలా అవుతుందని? ఏదో దెబ్బ తగిలింది గదా అని, నూనె గుడ్డ కట్టాడు గానీ పరి కుప్పలు కాల్చాలనే వుద్దేశం వాడికి లేదుగా! లేదు - ఈ విషయంలో మూడో వాడి తప్పేమీ లేదు. నష్ట పరిహారం కూడా యిచ్చుకోవలసిన అవసరం లేదు. కాని అలా అంటే మిగిలిన వాళ్లు ఊరుకుంటారా? అని తికమక పడ్డారు.

నాకు చటుక్కున ఓ ఉపాయం తోచింది. "మూడో వాడు తన వాటాకు వచ్చిన కుక్క కాలు క్షేమంకోరి ఆనూనె గుడ్డ కట్టితే మాత్రం నష్ట పరిహారం యితనెందుకిచ్చుకోవాలి? నిజానికి నష్ట పరిహారం అనేది ఆమిగిలిన ముగ్గురూ కలిసి యితనికే ఇవ్వాలి నాన్నా" అనేశాను. నాన్న ఆశ్చర్యపోయారు-"అదెట్లారా?" అన్నారు.

"అది కాదండి కుక్కకి ఏ కాలికైనా దెబ్బ తగిలితే అది ఆకాల్ని భూమి మీద ఆన్చకుండా మిగిలిన మూడు కాళ్ళమీదే నడుస్తుంది కదా! అలాగే యీ కుక్కకూడా తన కాలిన కాలుని క్రిందఆన్చకుండా మిగతా ముగ్గురు వాటాలకు వచ్చిన ఆమూడు కాళ్ళమీదనే నడుచుకొంటూ ఆకుప్పల దగ్గరకు పరుగెత్తింది. మూడోవాని వాటా కాలు భూమి మీద ఆననే లేదు. ఆముగ్గురి వాటాకు వచ్చిన కాళ్లు సరిగా వుండబట్టే, యీ నాలుగో వాడి కుప్పకు ముందుగా నిప్పు అంటుకోవటం జరిగింది. అందుచేత యితనికే మిగిలినవాళ్లు నష్టపరిహారం యివ్వవలసి వస్తుంది" అన్నాను.

మా నాన్నకు పట్టలేనంత ఆనందం వచ్చి నన్ను అమాంతం కౌగలించుకొన్నారు. మరునాడు యిదే తీర్పు చెప్పేసరికి ఊరిలో వాళ్ళంతా ఎవరికీ నష్టం లేకుండా చేసినందుకు మానాన్నని తెగ పొగిడేశారంటే నమ్మండి.

ఆదెబ్బతో మనకీర్తి క్లాసులో వారం రోజులవరకూ మారు మ్రోగింది. సోమవారం యీ తీర్పులోబడి బడిఎగవేసి నందుకు వీపు మ్రోగి పోయింది. ★